సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 6 ၊ ఆగస్టు ၊ 2024



మూగ జీవాలపై మృత్యు పంజా

గత నెల రోజుల్లో రైతుల పొలాల్లో వుండే సుమారు 40 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి.

8లో



పారా అథ్లెట్లకు అభినందనలు

విశాఖ: జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ సాధించిన అథ్లెట్లను ఘనంగా సత్కరించారు.



900 కేజీల పీడీఎస్ రైస్ పట్టివేత

విశాఖ: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 900 కేజీల పీడీఎస్ రైస్‌ను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు.

కూటమి క్యాంపు కుట్ర!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నేతల కుయుక్తులు
- పల్లా ఇంట్లో ఎమ్మెల్యేల భేటీ
- అనుకూలంగా ఉన్న వారిని తరలించేందుకు ఎత్తుగడ
- లొంగని వారికి డబ్బుల ఎర



సాక్షి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీకి అలవాటైన కుట్ర రాజకీయం మరోసారి తెరపైకి వచ్చింది. ఎన్నికలు ఏవైనా సరే డబ్బులతో ఎదుటివారిని కొనెయ్యడమే వారి నైజం. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు సంఖ్యా బలం లేకపోయినా పోటీలో నిలబెడుతూ క్యాంపు రాజకీయాలు నడపాలని చూస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని అమరావతికి తరలించి.. అక్కడే ఎన్నికలయ్యేంత వరకూ కాపాడుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. లొంగని వారికి డబ్బు ఎరగా చూపించి వారిని కూడా 'క్యాంపు'లకు పంపించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు మంగళవారం నోటిఫికేషన్ వెలువడనుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. ఉత్తరాంధ్ర జిల్లాలో అందరివాడిగా కీలక నేతగా పేరున్న బొత్సని ఢీకొట్టాలంటే తమ తరం కాదని నిర్ధారించుకున్న టీడీపీ.. కుట్ర రాజకీయాలకు తెరతీసింది. ఓట్లతో గెలవడం కష్టమనీ నోట్ల కట్టలతోనే విజయం సాధ్యమవుతుందని భావించి ఆ దిశగా కుయుక్తులు పన్నుతోంది.

పల్లా ఇంట్లో 'క్యాంపు' రాజకీయాలు

గాజువాకలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమి నేతల కీలక భేటీ సోమవారం రాత్రి జరిగింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు, వంశీకృష్ణ, విష్ణు కుమార్‌రాజు, ఎంపీ సీఎం రమేష్‌తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. కోట్లు కుమ్మరించైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా పనిచేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు డబ్బులను ఎరగా వేయాలని భావిస్తున్నారు. పలు ప్రాంతాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులను మచ్చిక చేసుకొని.. వారిని ఎన్నికలయ్యేంత వరకూ తమ పంచనే ఉండేలా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 60 మందిని అమరావతి తరలించి హోటల్స్‌లో 25 రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తీర్మానించారు. అదేవిధంగా ఏజెన్సీలో ఉన్న ప్రజాప్రతినిధులకు కోరినంత డబ్బాశ చూపించి.. వారిని తమ వైపు తిప్పుకునే బాధ్యతల్ని కూడా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు పల్లా సూచించారు. 2014 నుంచి 19 వరకూ అనకాపల్లి ఎమ్మెల్యేగా ఉంటూ మైనింగ్‌లో లెక్కలేనంత డబ్బులు కూడబెట్టుకున్న పీలా గోవింద సత్యనారాయణను ఎమ్మెల్సీగా నిలబెట్టాలని కూటమి భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో దోచుకున్న సొమ్మునంతా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచితే.. మళ్లీ దోచుకోవచ్చన్నది వీరి కుట్రగా తెలుస్తోంది. తమ పరిధిలో ఓటర్లుగా ఉన్న వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకునే బాధ్యతని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తీసుకోవాలనీ.. ఇందుకు ఎంత ఖర్చయినా భరించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

నేటి నుంచి నామినేషన్లు

- ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల నేడు
- 30న పోలింగ్, వచ్చే నెల 3న కౌంటింగ్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. ఈ ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ ఎన్ని కల్లో విశాఖ జిల్లాతోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ సభ్యులు ఓటర్లుగా ఉంటారని పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 14వ తేదీన స్క్రూటినీ, 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 30న పోలింగ్, వచ్చే నెల 3న లెక్కింపు ఉంటుందన్నారు.

అల్పజీవుల పొట్ట కొట్టకండి



స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలని ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆయా సంఘాల నాయకులు

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

తుమ్మపాల: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కీం వర్కర్లపై వేధింపులు పెరిగిపోయాయని, ఎండీఎం, వీవోఏ, అంగన్‌వాడీ, ఆశ, వీఆర్పీ, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను వందల సంఖ్యలో తొలగిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద స్కీం వర్కర్లతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది స్కీం వర్కర్లను రాజకీయ కక్షతో తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం ఆర్పీలపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పొందిన ఉద్యోగాల నుంచి స్వచ్ఛందంగా తొలగిపోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఐదు నెలలుగా ప్రభుత్వ స్కూల్ స్వీపర్లకు, గ్రామ పంచాయతీల్లో కార్మికులకు ఆర్నెల్లుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయ ఢంకా మోగిద్దాం

- మూడు వంతుల ఓట్లు వైఎస్సార్‌సీపీ వైపే..
- ప్రలోభాల విష కూటమికి బుద్ధి చెప్పండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ





మాడుగుల, చోడవరం నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

చోడవరం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో పార్టీ విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో మండలాల వారీగా సమీక్ష జరిపారు. మెజార్టీ ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉన్నందున పార్టీకి విజయావకాశాలు పూర్తి స్థాయిలో ఉన్నాయని, ప్రలోభాలు విసురుతున్న కూటమికి బుద్ధి చెప్పేలా పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలంతా తనకు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. వ్యవస్థలను గౌరవించాలనే ఉద్దేశంతో పూర్తి స్థాయి మెజార్టీ ఉన్నందున తమ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనను పార్టీ అభ్యర్థిగా నిలిపారని, విజయానికి అంతా కృషి చేయాలని కోరారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో చంద్రబాబు మాయమాటలతో అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటికీ ప్రజల పక్షాన పార్టీ శ్రేణులంతా ఉండాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన చెప్పారు.

ఉత్తరాంధ్ర వాణి వినిపించేందుకు అవకాశం

మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్సీ రూపంలో ఉత్తరాంధ్ర సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీకి అవకాశం వచ్చిందని, దీనిని సద్వినియోగపరచుకుందామన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిళ్ల సభ్యులు కార్పొరేటర్లంతా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీగా తాను పోటీ చేయాలని ఆశించానని కొన్ని పత్రికల్లో లేనిపోని వార్తలు రాశారని, తనకు ఆ ఆలోచన లేదని, బొత్స సత్యనారాయణలాంటి సీనియర్ నాయకులు శాసనమండలిలో ఉంటే ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి మేలు జరుగుతుందని చెప్పారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే ప్రజలకు నరకం చూపిస్తోందన్నారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చంద్రబాబు భావిస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని అన్నారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఎటువంటి ఢోకా లేదని అన్నారు. వైఎస్సార్‌సీపీకి 600కు పైగా ఓట్లు ఉన్నాయని, కనీసం 200 ఓట్లు కూడా లేని టీడీపీ కూటమి అభ్యర్థిని ఎన్నికల్లో నిలపడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మాడుగుల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర్లె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

బొత్సను గెలిపించుకుందాం

- అనకాపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో బొడ్డేడ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతితో కలిసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామని ఇప్పటికే రాష్ట్ర ప్రజలు నిర్ధారణకు వచ్చారని పేర్కొన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జెండా మోసిన ప్రతి కార్యకర్తను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. కూటమి పాలనలో ఇసుకపై ఇప్పటికే ప్రజలు ప్రభుత్వాన్ని ఛీకొడుతున్నారని ఆక్షేపించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు పెరిగాయన్నారు. త్వరలో కమిటీని ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని కార్యకర్తలకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 615 ఓట్లు ఉండగా వైఎస్సార్‌సీపీకి 400 మంది మద్దతు ఉందని, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితిలో రెండేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా, సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డి పాలన గొప్పతనం ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామంలో కూటమి ప్రభుత్వ వేధింపులతో మనస్తాపానికి గురై ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీ వార్డు సభ్యుడు గొల్లవిల్లి బాబూరావు కుటుంబ సభ్యులను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. బాబూరావు భార్య దుర్గలక్ష్మికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెట్టు నరికివేతపై చర్యలు

- సాక్షి కథనానికి స్పందన

యలమంచిలి రూరల్: పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ విశ్రాంతి భవనం ప్రాంగణంలో ఉన్న భారీ రావి చెట్టు నరికివేతపై రెవెన్యూ అధికారులు స్పందించారు. కోర్టుకు వెళ్లే రహదారిలో ఉన్న 70 ఏళ్ల భారీ వృక్షాన్ని శనివారం స్థానికుడొకరు ఇటుక బట్టీ యజమానికి విక్రయించిన విషయం తెలిసిందే. వాల్టా చట్టం ప్రకారం అధికారుల అనుమతి లేకుండా కూలీలను పెట్టి చెట్టును నరికివేసిన వైనంపై ఆదివారం సాక్షిలో 'పచ్చని చెట్టుపై గొడ్డలి వేటు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో యలమంచిలి డిప్యూటీ తహసీల్దార్ పి.మురళీబాబు స్పందించారు. ఎలాంటి అనుమతి లేకుండానే ప్రభుత్వ విశ్రాంతి భవనం ప్రాంగణంలో ఉన్న చెట్టును నరకడంపై నివేదిక ఇవ్వాల్సిందిగా యలమంచిలి అటవీ రేంజ్ అనిల్ కుమార్‌కు సోమవారం అధికారికంగా లేఖ పంపించారు.

స్థానిక రోడ్లు, భవనాల శాఖాధికారులకు, విద్యుత్ శాఖాధికారులకు కూడా ఈ మేరకు లేఖలు పంపించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ సాక్షికి తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి సమాచారం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

రైలు ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ విచారణ

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఆగి ఉన్న కోర్బా – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ కోచ్ అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. సూరత్ జైన్ (చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్), ఎస్‌సీ బెహరా (చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్), బీఎస్ నాథ్ (చీఫ్ సెక్యూరిటీ కమిషనర్)తో కూడిన బృందం సోమవారం విశాఖపట్నం కోచింగ్ కాంప్లెక్స్‌లో విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం చేరుకున్న కమిటీ సభ్యులు సోమవారం ఉదయం స్టేషన్ యార్డ్, మెయింటినెన్స్ డిపోలలో పర్యటించారు. రైల్వే అధికారులతో, స్టేషన్ సిబ్బందితో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ కోచ్ తయారుచేసిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (చెన్నై) ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ఆర్‌డీఎస్‌వో (లక్నో), ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ప్రమాదానికి సంబంధించిన సాంకేతిక వివరాలు సేకరించి విచారణలో భాగంగా కోచ్‌ను పరిశీలించారు. ఆదివారం రాష్ట్ర ఫోరెన్సిక్ బృందం కూడా కోచ్‌ను పరిశీలించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ



శ్రావణమాసం తొలి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులరెడ్డి పూజలు ప్రారంభించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. వేదమంత్రాల మధ్య నాదస్వర సుస్వరాలు నడుమ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. పూజలో 25 మంది ఉభయదాతలు రెండు బ్యాచ్‌ల్లో పాల్గొన్నారు. శ్రావణ మాసం నెలరోజులు (వచ్చే నెల 3వరకు) జరిగే పూజలకు అవసరమయ్యే సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని, ప్రత్యేక పూజల్లో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రం, కండువా, జాకెట్టు, రాగి స్టాండు యంత్రం, ప్రసాదం అందజేయనున్నట్టు ఈవో తెలిపారు. శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు గురు/శుక్ర వారాలు మినహా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తామన్నారు. పరోక్షంగా పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమ చేసి, పేరు, గోత్రం చిరునామా వివరాలు తెలపాలన్నారు.

చిరికివానిపాలెం టూ పారిస్

గతేడాది ఏషియన్ పారా క్రీడల్లో మెరిసిన చిరికివానిపాలెం క్రీడా ఆణిముత్యం మరోమారు అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే పారిస్ పారా ఒలింపిక్స్ పోటీలకు ఏపీ నుంచి ఎంపికైన ఏకైక పారా క్రీడాకారుడు కాగా, అక్కడ జేగంట మోగించి క్రీడా చరిత్రలో తన పేరు లిఖించుకోవడానికి కఠోర సాధన చేస్తున్నాడు.

- పారా ఒలింపిక్స్ పోటీలకు రొంగలి రవి
- బెంగళూరులోని షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి అర్హత
- ఏపీ నుంచి ఎంపికైన ఏకైక పారా క్రీడాకారుడు
- ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 'పారా' పోటీలు



సిల్వర్ పతకాన్ని సాధించిన రవి



ఏషియన్ పారా క్రీడా పోటీల్లో సిల్వర్ మెడల్

చైనాలో గతేడాది అక్టోబరులో జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో పారా క్రీడాకారుడు రవి సిల్వర్ మెడల్ సాధించాడు.

కె.కోటపాడు: పారిస్‌లో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించే పారా ఒలింపిక్స్ పోటీలకు కె.కోటపాడు మండలం వారాడ శివారు చిరికివానిపాలేనికి చెందిన రొంగలి రవి ఎంపిక య్యాడు. గత నెల 16, 17 తేదీల్లో బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో పారా క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి షాట్‌పుట్ ఎఫ్–40 విభాగంలో పాల్గొనున్నాడు. ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 38 మంది పారా క్రీడాకారుల్లో ఏపీ నుంచి రవి మాత్రమే ఉండటం గమనార్హం.



చైనా పోటీల్లో రవితోపాటు పారా క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధాని మోదీ



తల్లిదండ్రులు, సోదరుడితో రవి

అప్పట్లో అతడిని ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. స్వగ్రామం చిరికివానిపాలెంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి

చిన్నప్పటి నుంచి రవి చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని చూపేవాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు భీమిలీ ఏఎంజీ పాఠశాలలో చదివాడు. పదిలో 9.0 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఎస్.కోటలో ఇంటర్ చదివి 933 మార్కులు, డిగ్రీలో 7.8 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. చదువుకున్న రోజుల్లో తనకు దివ్యాంగత్వం ఉన్నా, తోటి స్నేహితులతో క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు.

ఆర్థిక స్థోమత లేకపోవడంతో అథ్లెటిక్స్ వైపు...

తల్లిదండ్రులు దేముడుబాబు, మంగ వ్యవసాయం చేస్తుంటారు. వీరి ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండడంతో రవికి ఎంతో ఇష్టమైన బ్యాడ్మింటన్ విభాగం నుంచి అథ్లెటిక్స్ వైపు మళ్లాడు. షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నాడు. క్రీడా కోటాలో భాగంగా 2023లో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాన్ని పొందాడు.

ఈ నేపథ్యంలో పారిస్‌లో పారా ఒలింపిక్స్ పోటీలకు ఎంపికైనట్టు తెలుసుకున్న గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పతకాన్ని సాధించి, దేశానికి తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పతకాన్ని సాధిస్తాను

దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి పారా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించాలన్నదే నా కల. నా తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ అండగా నిలబడ్డారు. గ్రామస్తులు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ జి.కోటేశ్వరరావు, సెక్రటరీ రామస్వామి అందించిన ప్రోత్సాహంతోనే పారిస్ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ పొందగలిగాను. తప్పనిసరిగా షాట్‌పుట్ ఎఫ్–40 విభాగంలో పతకాన్ని సాధిస్తాను.

– రొంగలి రవి, పారా క్రీడాకారుడు, చిరికివానిపాలెం గ్రామం

సాధించిన పతకాలు ఇవే...

- 2015లో బెంగళూరులో జరిగిన జాతీయత స్థాయి బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బ్రాంజ్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.
- 2016లో ఢిల్లీలో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో సింగిల్, డబుల్స్ విభాగాల్లో బ్రాంజ్ మెడల్
- 2017లో హైదరాబాద్‌లో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో డబుల్స్‌లో సిల్వర్ మెడల్
- 2017లో హర్యానాలో జరిగిన 18వ పారా చాంపియన్ షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్, జావలెన్‌త్రోలో గోల్డ్ మెడల్
- 2020లో బెంగళూరులో 3వ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, జావలెన్‌త్రోలో గోల్డ్‌మెడల్
- 2021లో దుబాయ్‌లో 13వ ఫజీ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో షాట్‌పుట్, జావెలెన్‌త్రోలో 4వ స్థానం
- 2022లో పోర్చుగల్‌లో ఐవర్ వరల్డ్ అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, జావలెన్‌త్రోలో సిల్వర్ మెడల్స్ సాధించాడు.

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోండి

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గె స్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఫిజిక్సు సబ్జెక్టు, కంప్యూటర్ సైన్సులలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్సు, ఎంటెక్ కంప్యూటర్, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లలో 55 శాతం మార్కులను పొంది ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్ మరియు స్లెట్ అర్హత పొందినవారు, అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు. 10వ తేదీ సాయంత్రం కార్యాలయం సమయం లోపల కళాశాలలో దరఖాస్తులను అందచేయాలని కోరారు. అభ్యర్థులు 12వ తేదీన తమ అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో మౌఖిక ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ కోరారు.

19, 20 తేదీల్లో ఫొటో ఎగ్జిబిషన్


ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మహారాణిపేట: విశాఖ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19,20వ తేదీల్లో నిర్వహించనున్న 185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే పోస్టర్‌ను సోమవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆవిష్కరించారు. జీవీఎంసీ సహకారంతో ప్రతి ఏడాది బీచ్‌రోడ్డు విశాఖ మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు రెండు రోజులపాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, కార్యదర్శి జీ.తిరుపతిరావు తెలిపారు. విశాఖలో ఫొటో జర్నలిస్టులు ఈ ఏడాదిలో తీసిన అద్భుత చిత్రాలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు

కొమ్మాది: ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కళ్లివానిపాలెం ప్రాంతానికి చెందిన ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేశాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న నిందితుడ్ని సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తిరుపతిరావు చెప్పారు.

మూగ జీవాలపై మృత్యు పంజా


పొలాల్లో కనబడుతున్న కుక్కల పాదముద్రలు


వింత జంతువును గుర్తించేందుకు ట్రాప్ ఏర్పాటు చేస్తున్న అటవీశాఖాధికారులు

- అర్ధరాత్రి లేగదూడలు, పెయ్యిలపై దాడి
- జంపపాలెంలో భయాందోళనలు
- నెల రోజుల్లో 40 మూగజీవాలు బలి
- గుర్తు తెలియని వింతజీవి ?
- ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీశాఖ

యలమంచిలి రూరల్ : మండలంలోని జంపపాలెం, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు పొద్దుపోతే హడలిపోతున్నారు. తెల్లారి లేస్తే ఏమవుతుందోనన్న భయానక పరిస్థితి ఏర్పడింది. గత నెల రోజుల్లో రైతుల పొలాల్లో వుండే సుమారు 40 మూగజీవాలు మత్యువాత పడ్డాయి. పాడి రైతులకు జీవనాధారమైన గోమాతలు, ఆవు పెయ్యిలు, లేగదూడలపై గుర్తు తెలియని వింతజీవి పంజా విసురుతున్నట్టు రైతులు, అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. దానిని గుర్తించడానికి అటవీశాఖాధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకూ ఆ జంతువు అంతు చిక్కలేదు.

అది పులి పంజాయేనా?

ఈ ప్రాంతంలో పులి సంచారం కూడా ఎక్కడా లేదు. విషయం తెలిసి ఇటీవల అటవీశాఖాధికారులు గ్రామ సమీపంలో 6 ట్రాప్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో కేవలం వీధి కుక్కలు మాత్రమే కనపడుతున్నాయి. అయితే జంతువులపై ఈ స్థాయిలో కుక్కలు దాడి చేయవని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. గోమాతల మూపురంపై విచక్షణారహితంగా దాడి చేసి,రక్తం తాగి, ఆ మాంసాన్ని తినే జంతువు ఏదైె వుంటుందనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. కుక్కలు, నక్కలు ఈ తరహా దాడులు చేయవని, అలాగే మన ప్రాంతంలో తోడేళ్లు లేవని అటవీశాఖాధికారులు చెబుతున్నారు.


ట్రాప్ కెమెరాల్లో కన్పిస్తున్న కుక్కలు


మృత్యువాత పడ్డ పశు సంపద

అర్ధరాత్రి దాటాక...

సరిగ్గా అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 4 గంటలలోపు ఇలా పశువులు గుర్తు తెలియని జంతువు దాడిలో మృత్యువాత పడుతున్నాయి. వాటి కళేబరాలపై పెద్ద, పెద్ద పంజా దెబ్బలు, గాయాలు వుండడంతో రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లేందుకు రైతన్నలు హడలిపోతున్నారు. పులి, కుక్కలు కాకుంటే ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తుందా ? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలల క్రితం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి సమీపంలో ఓ జీడి తోటలోకి అటవీ ప్రాంతం నుంచి ఎలుగుబంటి వచ్చి నీళ్లు తాగి వెళ్లిపోయింది. అక్కడే ఉన్న తోటమాలి దానిని చూసి అటవీఅధికారులకు సమాచారం ఇచ్చారు. జంపపాలెంలో పశువుల మృత్యువాత మిస్టరీని త్వరలోనే ఛేదించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమణ చెప్పారు.

ఆరు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశాం

జంపపాలెంలో మూగజీవాలను గుర్తు తెలియని జంతువు హతమారుస్తున్నట్టు రైతులు చెప్పారు. కొన్ని కళేబరాలను పరిశీలించాం. జంపపాలెంలోని పలు చోట్ల 6 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశాం. కానీ ఎటువంటి క్లూ దొరకలేదు. కుక్కలు సంచరిస్తున్నట్టు మాత్రమే సీసీ కెమెరాల పుటేజిలో కనబడుతోంది. మూగ జీవాలపై దాడి చేస్తున్న జంతువును పట్టుకునేందుకు అవసరమైన ట్రాప్‌లు కూడా త్వరలో ఏర్పాటు చేస్తాం.

–అనిల్‌కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, యలమంచిలి

వివాదాలపై భౌతికదాడులు సరికాదు


వైఎస్సార్ కాలనీలో ధ్వంసం చేసిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

- బాధితులకు అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,
- అనకాపల్లి సమన్వయకర్త భరత్‌కుమార్
- వడ్డివీధిలో ఇల్లు కూల్చివేత బాధితులకు పరామర్శ

కశింకోట : ఇల్లు కూల్చివేత బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. కశింకోటలోని వడ్డి వీధిలో ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు బండారు గణేష్ నిర్మించుకున్న ఇంటిని కూటమికి చెందిన వ్యక్తులు రౌడీ మూకలతో వచ్చి పొక్లెయిన్‌లతో ఆదివారం విధ్వంసం చేసి నష్టం కలిగించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి ధ్వంసం చేసిన ఇంటిని సందర్శించారు. బాధిత బండారు గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి బోరున విలపించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇంటిని దౌర్జన్యంగా రౌడీ మూకలతో వచ్చి ధ్వంసం చేయడం వంటి సంఘటనలు గతంలో ఈ ప్రాంతంలో ఎన్నడూ లేవన్నారు. ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అడ్డుకోవలసిన నైతిక బాధ్యత స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు ఉందన్నారు. వివాదాలుంటే న్యాయ పరంగాను, అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని, ఇటువంటి భౌతిక దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఇటువంటి దాడులను తమ పార్టీ పూర్తిగా ఖండిస్తోందని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటన గురించి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర సీనియర్ నేత, మాజీమంత్రి బొత్స సత్యనారాయణల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ ఇల్లు ధ్వంసం చేసిన సంఘటనపై పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ దృష్టికి మరోసారి తీసుకెళ్లి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమతోపాటు పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణరావు, వాటర్ వేస్ అథారిటీ సంస్థ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు,మాజీ వైఎస్ చైర్మన్ కరక సోమునాయుడు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, పలువురు పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

హత్యకు గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

తుమ్మపాల : మైనర్ బాలికను అత్యంత కిరాతకంగా నరికి చంపేసిన ఘటనపై పోక్సో యాక్టు ప్రకారం చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి నిర్భయ రిలీఫ్ ఫండ్ కేటాయించాలని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా మహిళా సంఘం, సీఐటీయు, డీవైఎఫ్ఐ ప్రజా సంఘాల నాయకులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఐద్వా మహిళా సంఘం, సీఐటీయు, డీవైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవుడు నాయుడు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకులు ఆర్. లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ బద్ది వెంకటరమణ మాట్లాడుతూ జూలై 6న రాంబిల్లి మండలం కొప్పుగొండపాలెం గ్రామంలో ప్రేమ పేరుతో బాలికను వేధించిన వ్యక్తిని శిక్షించినప్పటికి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, హోంమంత్రి ఇప్పటి వరకూ ఏ విధంగానూ ఆదుకోలేదన్నారు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలన్నారు.


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణికి వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బుచ్చింపేట పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


వైద్య సమస్యలు, సేవలపై వైద్యాధికారి సునీతను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాశాఖాధికారి బాలాజి

రోలుగుంట : మండలం బుచ్చింపేట పీహెచ్‌సీని జిల్లా వైద్యాశాఖాధికారి బాలాజి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో వార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యాధికారి సునీతతో ప్రబలుతున్న రోగాలు, ఏర్పాటు చేస్తున్న సేవల గురించి వైద్యాధికారితో చర్చించారు. సీజనల్‌గా వచ్చే రోగాల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గల రోగులకు వైద్య సేవలు విస్తృపరచాలన్నారు .

ఇంటి ధ్వంసం కేసులో 10 మంది బైండోవర్

కశింకోట : కశింకోటలోని వడ్డి వీధిలో ఉన్న వైఎస్సార్ కాలనీలో ఇంటిని ధ్వంసం చేసిన సంఘటనకు కారకులైన పది మందిని తహసీల్దార్ సురేష్‌నాయుడు ముందు సోమవారం బైండోవర్ చేశామని సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. వేగి పవన్‌కుమార్, పెంటకోట సత్యనారాయణ, గనిరెడ్డి కన్నారావు, ఆళ్ల దిలీప్‌కుమార్, దాడి రాము, పొలిమేర శ్రీను,పెంటకోట నాయుడు, ఆళ్ల అశ్వ శ్రీనివాస్, జెసీబీ డ్రైవర్లు మామిడి సాయి,కరణం దుర్గలను బైండోవర్ చేశామన్నారు. ఇకపై ఇటువంటి సంఘటనకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. అలాగే వీరిని అరెస్టు కూడా చేశామన్నారు.

నేడు నాయీ బ్రాహ్మణులకు ఉచిత సంగీత శిక్షణ

యలమంచిలి రూరల్ : జిల్లాలో నాయీ బ్రాహ్మణులందరికీ మంగళవారం జిల్లా వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు సంగీత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేసనకుర్తి అప్పారావు,కందికుప్ప గోవిందరావు తెలిపారు. చోడవరం మండలం వెంకన్నపాలెం నీలాద్రి లేఅవుట్‌లో కొత్తగా నిర్మించిన నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాలులో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.ఈ అవకాశాన్ని జిల్లాలో నాయీ బ్రాహ్మణులు సద్వినియోగపర్చుకోవాలని వారు కోరారు. సంఘం బలోపేతానికి, నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తాము కృషి చేస్తున్నామని సోమవారం యలమంచిలిలో జరిగిన జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సమావేశంలో వారు తెలిపారు. సమావేశంలో సంఘం పెద్దలు పి. వరప్రసాద్, పేరూరి సత్యనారాయణ, గుడివాడ వెంకట్రావు, కొడమంచిలి దక్షిణేశ్వర్రావు పాల్గొన్నారు.


యలమంచిలిలో నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చిస్తున్న జిల్లా నేతలు

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ప్రీతి, సరయు, ఆనన్య ఎంపికయ్యారని కోచ్ రమేష్ తెలిపారు. ఈ పోటీలు కర్నాటకలో ఈనెల 30 నుంచి 1 వరకు జరగనున్నాయి. ప్రీతి కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడు గోల్డ్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించిందని ఆమె తండ్రి వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని విశాఖపట్నం స్పోర్ట్స్ అథారిటీ ఆశిస్తుందని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మెకానిక్ మృతి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన క్రషర్లు, సీటి ఇంజిన్ల మెకానిక్ అల్లు అప్పారావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తెనుగుపూడి–మారేపల్లి రోడ్డు మార్గంలో చెరుకు తోటల్లో ఇతడి మృతదేహాన్ని అటుగా పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీలు సోమవారం గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో ఇతడి మృతి విషయం వెలుగులోకి వచ్చింది. క్రషర్ రిపేరు చేసి వస్తానని చెప్పి శనివారం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన తన భర్త కోసం అతని భార్య దుర్గలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు గత రెండు రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో అప్పారావు మరణవార్త విని ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందడంతో తమకు దిక్కెవరంటూ అతని భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు. ఇతని మృతితో మారేపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. క్రషర్ రిపేరు చేసి వస్తానని శనివారం భార్యకు చెప్పి అప్పారావు ఇంటి నుంచి వెళ్లాడు. సోమవారం ఉదయం చెరకు తోటలో అప్పారావు సోమవారం శవమై కనిపించాడు. మృతుడికి భార్య, కుమారులు శ్యామ్ కళ్యాణ్, పూర్ణ చందు ఉన్నారు. మృతుడి భార్య దుర్గలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


చెరకు తోటలో అల్లు అప్పారావు మృతదేహం (ఇన్‌సెట్) మృతుడు అప్పారావు(ఫైల్)

నడిచి వెళ్తుండగా దూసుకొచ్చిన మృత్యువు

- ఆగి ఉన్న లారీలను ఢీకొన్న మరో లారీ
- ముందుకు కదిలిన లారీ కింద నలిగి ఓ వ్యక్తి మృతి

ఎస్.రాయవరం : పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో నడిచి వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనపై ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొల్లు జంక్షన్‌కు కూతవేటు దూరంలో రెండు టిప్పర్ లారీలు రోడ్డు పక్కన ఒకదాని వెంట మరొకటి ఆగి ఉండగా, తుని నుంచి యలమంచిలి వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న లారీలు ముందుకు కదలడంతో అదే సమయంలో పెనుగొల్లు గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు(55) టీ తాగేందుకు రోడ్డుపక్కన నడిచి వెళుతుండగా లారీ అప్పారావు పై నుంచి వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన లారీ (ఇన్‌సెట్) మృతుడు అప్పారావు (ఫైల్)

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు


జలాశయంలో నీటిపై తేలి కనిపించిన సంజీవి మృతదేహం

చోడవరం : అదృశ్యమైన గిరిజన యువకుడు కల్యాణపులోవ రిజర్వాయంలో శవమై తేలాడు. మృతదేహాన్ని సోమవారం జలాశయం నుంచి బయటకు తీసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. చీమలపాడు పంచాయతీ డొకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు అలియస్ సంజీవి(35) శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం విదితమే. కాగా జలాశయంలో చేపల వేటకు వెళ్లి సంజీవి జలాశయంలోనే ప్రమాదానికి గురై గల్లంతై ఉంటాడనే అనుమానంతో పోలీసులు రెండు రోజులుగా జలాశయంలో గాలింపు చేపట్టారు. దీంతో జలాశయంలో ఓ చోట నీటిపై తేలుతూ యువకుడి మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు పంపించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలపట్ల కేంద్రం చిన్నచూపు

- అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆరోపించారు. పేరుకు బీసీ వ్యక్తి ప్రధానిగా ఉన్నారే కానీ.. బీసీలకు ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఏపీ భవన వద్ద అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేసింది. అనంతరం లగుడు గోవిందరావు మీడియాతో మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీ సామాజిక వర్గానికి 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ విషయంపై స్పష్టత రావాలని పేర్కొన్నారు. ఈ అంశంపై ఈనెల 9న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

సీటివ్వండి..లేకపోతే చచ్చిపోతా!

- పెందుర్తి ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థి హల్‌చల్
- గంజాయి మత్తులో వీరంగం

పెందుర్తి: గంజాయి మత్తులో ఓ టీనేజర్ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం వీరంగం సృష్టించాడు. గతేడాది ఇదే కళాశాలలో చదువుకున్నానని.. కానీ బహిష్కరించారని..ఇప్పుడు తనకు సీటివ్వకపోతే చచ్చిపోతానని బెదిరించాడు. పోలీసులు రంగప్రవేశం చేసి అతడ్ని రీహాబిలిటేషన్ కేంద్రానికి తరలించారు. వివరాలివి..పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి (17) గతేడాది పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాడు. అయితే క్రమశిక్షణారాహిత్యం కారణంగా అప్పట్లో కళాశాల నుంచి టీసీ ఇచ్చి పంపేశారు. అయితే సదరు విద్యార్థి గంజాయి మత్తులో సోమవారం కళాశాల ప్రాంగణానికి వచ్చి కర్రలతో విద్యార్థులను హడలగొట్టాడు. తనకు మళ్లీ సీటు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వాహనాల మధ్యకు వెళ్లి అలజడి రేపాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ అసిరితాత వెంటనే ఘటనాస్థలికి చేరుకుని అతన్ని అదుపులోనికి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


విద్యార్థిని స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్ఐ అసిరితాత

ఇంటి నిర్మాణానికి లంచం అడిగారు

- సచివాలయ సిబ్బందిపై ఆర్డీవోకు ఫిర్యాదు

నర్సీపట్నం : సచివాలయ సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని మున్సిపాలిటీ 17వ వార్డు బలిఘట్టం ఎస్సీ కాలనీకి చెందిన కె.కుమారి అనే మహిళ సోమవారం ఆర్డీవో హెచ్.వి.జయరాంకు ఫిర్యాదు చేసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తను గృహ నిర్మాణం చేసుకుంటుంటే సచివాలయ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. రూ.50 వేలు లంచం ఇస్తేనే ఇల్లు కట్టనిస్తాం...లేదంటే కట్టడానికి వీల్లేదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఆర్డీవోకు మొరపెట్టుకుంది. తాను ఒంటరి మహిళను న్యాయం చేయాలని ఆర్డీవోను వేడుకుంది. మహిళ ఫిర్యాదుపై స్పందించిన ఆర్డీవో సచివాలయ సిబ్బందిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబును ఆదేశించారు.


ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ మహిళ కుమారి

నిర్మాణంలో ఉన్న పౌల్ట్రీలో చోరీ

- రూ. 32 వేలు విలువ చేసే విద్యుత్ వైర్లు అపహరణ

దేవరాపల్లి : నాగయ్యపేట పంచాయతీ సీతంపేట శివారులో నిర్మాణంలో ఉన్న విజయ దుర్గ పౌల్ట్రీ ఫామ్‌లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. కోళ్ల ఫారం చుట్టూ వేసిన ఇనుప మెస్‌ను కట్ చేసి లోపలికి ప్రవేశించారు. కోళ్ల ఫారంలో వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు సుమారు రూ. 32 వేలు విలువ చేసే విద్యుత్ వైర్లను అపహరించుకుపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు కోళ్ల ఫారం నిర్వాహకులు తెలిపారు. ఇటీవలే ఇదే సీతంపేట రెవెన్యూలోని జీవీఎంసీ కాలువకు ఆనుకొని ఉన్న పౌల్ట్రీలో కూడా దొంగలు చొరబడి సామాగ్రిని దోచుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది.


కోళ్ల ఫారం ఇనుప మెస్ కట్ చేసిన దొంగలు

క్లుప్తంగా

ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనకు కృషి



ఉత్తరాంధ్ర సమస్యలపై నిరసన తెలుపుతున్న ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కుల, మత, జాతి, వర్ణ లింగ భేదాలు లేకుండా అందరూ కృషి చేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు పిలుపునిచ్చారు. వెనుకబాటుతనం, సహజ వనరుల దోపిడి నుంచి ఉత్తరాంధ్రను కాపాడుకోవాలంటూ కలెక్టరేట్ గేటు వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాయలసీమ పెత్తందారులు వద్దు, ఉత్తరాంధ్రే మనకు ముద్దు నినాదంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత రాష్ట్రంలో పెత్తందార్ల చేతుల్లోనే రాజ్యాధికారం ఉందని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేలా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఆర్వో శ్రీనివాసరావుకు ఈ మేరకు వినతి పత్రం అందించారు.

10న మండల సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న 13వ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

సీజ్ చేసిన ఆటోల వేలం రేపు

సబ్బవరం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో పాత ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ రెండు ఆటోలను ఈ నెల 7న వేలం వేయనున్నట్లు స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు సబ్బవరం సెబ్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

తగ్గిన కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు స్వల్పంగా తగ్గాయి. వంకాయ ధర మాత్రం ఆకాశాన్నంటింది. కిలో రూ.80కి విక్రయాలు సాగాయి. బీరకాయ రూ.60 నుంచి రూ.40కి, బంగాళాదుంప, టమాటా రూ.50 నుంచి రూ.40కి తగ్గాయి. బెండకాయ రూ.40 నుంచి రూ.30కి తగ్గింది. ఇక బీట్రూట్, క్యారెట్ ఎప్పటిలాగే రూ.60, కాకర, గోరు చిక్కుడు కూడా ఇదే ధరకు విక్రయాలు సాగాయి. పాదు చిక్కుడు రూ.100, పచ్చిమిర్చి రూ.120కి అమ్మకాలు జరిగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 129 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,250	5,250
రెండో రకం	--	--
మూడోరకం	3,200	3,400

అనకాపల్లి సినిమాలు

శివం భజే	: రాజా
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
బడ్డీ	: సత్యనారాయణ స్క్రీన్-2
అలనాటి రామచంద్రుడు	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
పురుషోత్తముడు	: శ్రీసత్య
ఉషాపరిణయం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 334 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు వేళాయె

గ్రామ స్థాయిలో ఎన్నికల సందడి మొదలయింది. ఓ వైపు ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి నడుస్తోంది. అంతకంటే మిన్నగా పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలకు అనకాపల్లి పట్టణ, మండల పరిధిలోని 107 పాఠశాలలు సిద్ధమయ్యాయి. ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజకీయ పార్టీలు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గ్రామాల్లో చర్చోపచర్చలు నడుస్తున్నాయి.

- పట్టణ, మండల పరిధిలో 107 స్కూళ్లలో ఎన్నికలు
- ముగిసిన ఓటర్ల జాబితా అభ్యంతరాల పరిశీలన
- పాఠశాలల నోటీస్ బోర్డుల్లో తుది ఓటర్ల జాబితా
- 8న ఎన్నికలు, ప్రమాణస్వీకారం, కమిటీ తొలి భేటీ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు



జీవీఎంసీ పెద్ద హైస్కూల్

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతుల పర్యవేక్షణతోపాటు, విద్యార్థులకు మంచి బోధన, మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) సక్రమ నిర్వహణ తదితర అంశాలపై తల్లిదండ్రుల నేతృత్వంలోని ఎస్‌ఎంసీ కీలకం. ఈ నెల 1న విద్యాశాఖ ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 8వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలి. ఈ మేరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. పట్టణ, మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 107 ఉన్నాయి. వీటిలో సుమారు 9,160 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు.

ఎన్నికయ్యే సభ్యులు

ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఒక మహిళ ఉండాలి. మిగిలిన ఇద్దరిలో ఒకరు ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ కేటగిరీకి చెందినవారు, ఇంకొకరు బీసీ/ఈబీసీ/మైనార్టీ వర్గాలకు చెందినవారై ఉండాలి. స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నవారు, టీచర్లు, హెచ్‌ఎంలు ఎస్‌ఎంసీ ఎన్నికల్లో పోటీకి అనర్హులు. కమిటీకి అదనంగా ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు. వీరిలో సంబంధిత స్కూల్ హెచ్‌ఎం, మహిళా విభాగం నుంచి సీనియర్ ఉపాధ్యాయుడు, కౌన్సిలర్, వార్డు మెంబర్ అంగన్‌వాడీ టీచర్, ఫిమేల్ మల్టిపర్పస్ హెల్త్‌వర్కర్, గ్రామైక్య సంఘం అధ్యక్షులు ఉంటారు.

ఎన్నికలు జరిగే విధానం

పాఠశాలల నోటీసు బోర్డుల్లో ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. సోమవారం అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించి తుది జాబితాను సిద్ధం చేశారు. ఈ నెల 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలకు కనీసం 50 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు తప్పనిసరి. మధ్యాహ్నం 2గంటల తరువాత ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ని ఎన్నుకుంటారు. అనంతరం ప్రమాణస్వీకారం నిర్వహించి, కమిటీ మొదటి సమావేశం జరుగుతుంది. చేతులు ఎత్తే విధానం, నోటి ద్వారా తమ మద్దతు తెలుపడం తదితర పద్ధతుల్లో ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఎక్కువగా చేతులు ఎత్తే పద్ధతిలోనే ఈ ఎన్నికల్ని నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం స్థానిక ఓటర్లు, పోటీ చేస్తున్న అభ్యర్థుల అభ్యర్థన మేరకు రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు.

తల్లిదండ్రుల్లో ఒక్కరికే ఓటు

విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒక్కరికే ఓటు హక్కు ఉంటుంది. ఎస్‌ఎంసీకి ఎన్నికైన సభ్యుల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు బీసీ వర్గానికి చెందిన మహిళై ఉండాలి. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికలకు అంతరాయం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఎన్నికల ప్రక్రియలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పరిశీలకులుగా వ్యవహరిస్తారు.



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్‌ను అతికిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు



ఈ నెల 8న జరగనున్న ఎన్నికల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నా. రెండు సార్లు స్థానిక ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించా. ఈసారి కూడా పోటీలో ఉన్నా. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని పాఠశాల హెచ్‌ఎం చెప్పారు. ఎస్‌ఎంసీ ఎన్నికలపై ఏం నిర్ణయం తీసుకుంటారో తెలియాలి. కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశాం. ఎక్కడా ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా పాఠశాల అభివృద్ధి పనులు జరిగాయి.

– పక్కుర్తి వెంకటరావు, ఎంపీపీ స్కూల్ చైర్మన్, సత్యనారాయణపురం

క్షయ రోగులపై అప్రమత్తత తప్పనిసరి

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ వ్యాధి ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులు, సర్వే వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి యశోదకు సూచించారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కేసును ప్రతి నెలా పరిశీలిస్తున్నట్లు యశోద ఆయనకు వివరించారు. కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్‌వైజర్ వెంకటరమణ, ఫార్మసీ ఆఫీసర్ ఫణి భూషణం, ఫీల్డ్ సూపర్‌వైజర్ రామ్మూర్తి, సిబ్బంది సుబాని, హనుమంతు పాల్గొన్నారు.



కశింకోట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న క్షయ వ్యాధి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి

అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకోండి

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకునేందుకు అగ్రిగోల్డ్ ఆస్తుల్ని ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ అనకాపల్లి శాఖ గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావులు కోరారు. స్థానిక గవరపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తుల్ని విక్రయించి, డిపాజిట్‌దారులకు చెల్లింపు చేయాలని కోరారు. పదేళ్లుగా ప్రభుత్వాలు పట్టించుకోక అనేక మంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్ని మోసం చేసి కోట్లాది రూపాయలు దోచుకున్న అగ్రిగోల్డ్ సంస్థపై చర్యలు తీసుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి ముల్లేటి గోపాల రమణ, సభ్యులు పి.శేషు, ఎన్నంశెట్టి సూరిబాబు, రామ అప్పారావు, జె.దుర్గారావు, కొణతాల శ్రీనివాసరావు, ఎం.శేషు తదితరులున్నారు.



ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ఏవో చంద్రావతి



సీహెచ్ చంద్రావతి, వ్యవసాయాధికారి

పరవాడ: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి పిలుపునిచ్చారు. గుర్తింపు కార్డుల కోసం స్థానిక వ్యవసాయ సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు భూమి యజమాని అంగీకార పత్రం, భూ యజమాని ఆధార్ కార్డు జెరాక్స్, భూ యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, 1బీ జెరాక్స్, కౌలు రైతు ఆధార్ జెరాక్స్, భూ యజమాని, కౌలు రైతు ఫోన్ నంబర్లను వ్యవసాయ సహాయకులకు సమర్పించాలన్నారు. అప్పుడు 11 నెలల కాలానికి కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడం ద్వారా బ్యాంకులో రుణ సదుపాయం పొందవచ్చునని చెప్పారు. రాయితీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు కౌలు రైతుల పేరుతోనే కొనుగోలు చేసుకొనే సౌలభ్యం లభిస్తుందన్నారు. పంట నమోదు, పంటల బీమా, పంట నష్టపరిహారం కౌలు రైతు పేరుతోనే వస్తుందని చెప్పారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో అమ్మకం కౌలు రైతు పేరుతోనే చేయవచ్చునని చెప్పారు.

బొత్సను ఎమ్మెల్సీగా గెలిపించి సత్తా చాటుదాం





సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, హాజరైన ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు

- ఎంపీటీసీలు, కార్పొరేటర్లతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించి, పార్టీ సత్తాను కూటమి నేతలకు చాటిచెప్పాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి పిలుపునిచ్చారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.

నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు 615 ఉండగా అందులో దాదాపు 400 మంది మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ఈ నెల 7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరుగుతాయని, స్టాండింగ్ కమిటీలో పార్టీ కార్పొరేటర్లు సమష్టిగా నిలిచి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్కూల్ కమిటీల ఎన్నికల్లో కూడా పార్టీ నాయకులు పోటీచేసి గెలిచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎంపీటీసీలను, కార్యకర్తలను దశల వారీగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కూటమి నాయకుల వేధింపుల వల్లే కశింకోట మండలంలో పార్టీ సానుభూతిపరుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామంలో బలహీన వర్గానికి చెందిన కుటుంబం నిర్మించుకున్న ఇంటిని కూడా కూటమి నాయకులు కూల్చివేయడం దారుణమన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయినట్లు ప్రజలకు ఇప్పటికే అర్థమయిందన్నారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలను మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో దాడులకు గురైన, గురవుతున్న పార్టీ శ్రేణులకు అండగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

మాజీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఐక్యతగా ఉండి ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాను ప్రజలు ఇప్పటికే గమనించారని తెలిపారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో రెండేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా, సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డి పాలన గొప్పతనం ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోందన్నారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మైండ్ గేమ్ ఆడుతోందని, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు గమనించి తమ అభ్యర్థి బొత్స విజయానికి కృషి చేయాలన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో స్కూల్ కమిటీ ఎన్నికలు జరగుతున్నాయని, పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ నెల 10న మండల పరిషత్ 13వ సర్వసభ్య సమావేశం జరుగుతుందని, మండల పరిషత్ నిధులు రూ.3 కోట్లు ఉన్నాయని, సమావేశానికి వచ్చే ముందే గ్రామాల సమస్యలపై తీర్మానాలు చేసుకుని మండల పరిషత్‌లో నిధులు మంజూరు చేయించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కరక సోమునాయుడు, కలగా గున్నయ్యనాయుడు, శోభ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన అప్పారావు

పరవాడ: అనకాపల్లి-గాజువాక రహదారిలో లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలు.. అనకాపల్లి మండలం మారేడుపూడికి చెందిన అప్పారావు(48) ద్విచక్ర వాహనంపై శ్రీరామనగర్ కాలనీకి వెళుతున్నారు. ఈ క్రమంలో లంకెలపాలెం ప్రభుత్వ వైన్‌షాపు దాటిన తర్వాత ఎడమ వైపు తిరుగుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన ఫార్మాసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు, అప్పారావు నడుపుతున్న బైక్ హ్యాండిల్‌ను రాసుకుని వెళ్లిపోయింది. దీంతో అప్పారావు రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. ఇంతలో అదే మార్గంలో వస్తున్న మరో ద్విచక్ర వాహనం రోడ్డు మీద పడివున్న అప్పారావుపై నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై మృతుడి కుమారుడు కనకరాజు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

పొలం పనులు

వరిలో కాలి బాటలు తప్పక తీయాలి

నక్కపల్లి : వరిలో పంట వేస్తున్న రైతులు పొలాల్లో తప్పకుండా కాలి బాటలు తీయాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో పొలం బడి నిర్వహించారు. మండలంలో సుమారు 4400 ఎకరాలు సాధారణ సాగు కాగా, సరిపడా వరి నారు వేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సాధారణ వర్షాపాతం 453 మి.మి కాగా 380 మి.మీ పడిందన్నారు. అందుబాటులో వున్న చెరువు నీటితో ఆయా గ్రామాల్లో చినరామభద్రపురం, దేవవరం, డొంకాడ, కాగిత, దోసలపాడు, ఉద్దండపురం గ్రామాల్లో వరి నాట్లు మొదలు పెట్టారన్నారు. ఇప్పటివరకు సుమారు 850 ఎకరాల్లో వరి నాట్లు వేయడం జరిగిందన్నారు. వరి నారు తీసే వారం రోజులు ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు ఐదు సెంట్లు వరి నారుమడిలో 800 గ్రాములు ఇసకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. నాట్లు వేసుకునేటప్పుడు కొనలు తుంచి నాటుకోవాలని, దమ్ము చేపట్టి ఎకరానికి ఎరువులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 150 కేజీలు, యూరియా 30 కేజీలు, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. నాలుగు నుంచి ఆరు ఆకులు వున్న నారును ఉపయోగించాలని, చ.మీ.కు 33 మూనలు వుండేలా చూసుకోవాలని తెలిపారు. నాటిన తరువాత ప్రతి 2 మీటర్లకు 20 సె.మీ బాటలు తీయాలని, దీనివల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడలు ఉధృతి తగ్గుతుందన్నారు. క్షేత్ర పర్యటనలో ఏఈఓ ఓ.సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ సురేంద్ర పాల్గొన్నారు.



దేవవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నారుమడులు నష్టపోయిన రైతులకు విత్తనాలు

రాంబిల్లి(యలమంచిలి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి నారుమడులు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేయడం జరుగుతుందని రాంబిల్లి మండల వ్యవసాయాధికారిణి సుమంత అన్నారు. సోమవారం రాంబిల్లి మండలంలో దిమిలి, కట్టుబోలు, మురకాడ, కొప్పుగుండుపాలెం గ్రామా ల్లోని నష్టపోయిన రైతులకు రాయితీపై ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడులకు 50 క్వింటాళ్ల ఆర్‌జియల్,-2537 శ్రీకాకుళం సన్నాలు రకం విత్తనం 80 శాతం రాయితీపై రైతులకు అందజేయడం జరుగుంతుందని అలాగే 30 కేజీల విత్తనాల బస్తా 250కి అందజేయడం జరుగుతుందని,వరి నారుమడులు దెబ్బతిన్న రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి విత్తనాలు పొందాలని ఆమె కోరారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన డీఎల్‌పీవో

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో సోమవారం డీఎల్‌పీవో మూర్తి పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఇంతవరకు జరిగిన వ్యాపారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీజన్‌లో ఎటువంటి వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

రూ.30 లక్షలతో రహదారి మరమ్మతు పనులు

అనకాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు అనకాపల్లి-చోడవరం రహదారిలో పాడైన చోట ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ప్రజల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి రూ.30 లక్షల నిధులు విడుదల చేశారు. వీటితో మండలంలోని తుమ్మపాల, ఆర్‌వీ నగర్ రహదారి పనులను ఆర్ అండ్ బీ అధికారులు సోమవారం ప్రారంభించారు. 10 రోజుల్లో రహదారి మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు జరిగే సమయంలో వాహనదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.



తుమ్మపాల గ్రామంలో పనులు చేస్తున్న దృశ్యం

హాస్య నటుడు అప్పారావుకు సత్కారం



టీవీ నటుడు అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : టీవీ నటుడు జబర్దస్త్ అప్పారావుకు సోమవారం ఘన సత్కారం నిర్వహించారు. శ్రావణ మాసంలో భాగంగా అప్పారావు మండలంలోని పుణ్యక్షేత్రాలైన టి.సిరసపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం, వెంకటాపురంలోని పరమేశ్వరుని ఆలయాలను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావును వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనకప్పారావు, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, అనకాపల్లి నూకాంబి ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు తదితరులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.